జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 173 9-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ


94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## మౌలిక వసతులపై భీకర దాడులు

- ఇరాన్ రైల్వే వంతెనలను నాశనంచేసిన అమెరికా సేన
- తొలిసారిగా చాబహార్ నౌకాశ్రయంపై మెరుపు దాడి
- మారిటైమ్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ ధ్వంసం
- బుషెహర్‌లోని అణు విద్యుత్ కేంద్రం సమీపంలోనూ పేలుళ్లు
- ప్రతిగా అమెరికా మిత్ర దేశాలపై ఇరాన్ దాడులు






## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపేశా

2లో

మరోసారి ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

## బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

- హైకోర్టు కీలక తీర్పు
- బెయిల్‌కు షరతులు విధింపు
- 49 రోజుల జైలు తర్వాత ఊరట
- దర్యాప్తుకు సహకరించాలని ఆదేశం



# మత విద్వేషాలు రెచ్చగొడితే కూటమి ప్రభుత్వం సహించదని హెచ్చరిక

- ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, బతికున్న తల్లికి ఆస్తి ఇవ్వక క్షోభ పెడుతున్నాడు: సీఎం చంద్రబాబు
- బనగానపల్లెలో రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ
- కుల, మత, ప్రాంతాలతో సమాజాన్ని విడగొట్టేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని చంద్రబాబు విమర్శ
- తీవ్రవాదాన్ని సమర్థించే వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం చేస్తోందని ఆరోపణ
- తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తి సమాజానికి అవసరమా అని పరోక్ష విమర్శలు



"ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, కళ్లెదుట బ్రతికున్న కన్నతల్లికి మాత్రం ఆస్తిలో వాటా ఇవ్వకుండా క్షోభ పెడుతున్న వ్యక్తి మనకెందుకు?" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కన్నతల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు రాష్ట్ర ప్రజలకు ఏం సేవ చేస్తారని ఆయన ప్రశ్నించారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు.దగత ప్రభుత్వ పెద్దల తీరును ఎండగడుతూ, "తిరుమలకు వెళ్లినప్పుడు డిక్లరేషన్ ఇవ్వడానికి నిరాకరించి అపచారం చేశారు. నేను మాత్రం చర్చికి, మసీదుకు వెళ్లినా అక్కడి ఆచారాలను గౌరవిస్తాను. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన వాడే అని తెలియగానే

- మిగతా 2వ పేజీలో



# మమ్మల్ని కొన్నాళ్లు పని చేయనివ్వండి

- అభివృద్ధి జరగనివ్వండి: సీఎం రేవంత్‌రెడ్డి
- రాజకీయాలకు సమయం కాదు.. ఎన్నికలప్పుడే రాజకీయాలు
- ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్:'మేము చేస్తున్న అభివృద్ధి పనులకు సహకరించకపోయినా పరవాలేదు కానీ.. అడ్డు తగులుతూ కడుపులో ఉన్న విషాన్నంతా రోజూ మాపై కక్కొద్దు.. రాజకీయాలు ఏమైనా ఉంటే ఎన్నికలప్పుడు చూసుకుందాం. ఎవరు ఏం చేశారో? అప్పుడు చర్చిద్దాం. మమ్మల్ని కొంతకాలం పని చేసుకోనివ్వండి..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారం కోల్పోయిన బాధ మీకు ఉన్నా అభివృద్ధి జరగనివ్వండని పరోక్షంగా విపక్ష బీఆర్ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురంలో ప్రీమియర్ ఎనర్జీస్ ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల సామర్థ్యంగల సోలార్ మాడ్యూళ్ల తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని రేవంత్ చెప్పారు. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా


- మిగతా 2వ పేజీలో

## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన
- కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి

2లో





## బలపడిన అణు బంధం

- భారత అణు విద్యుత్ ప్రాజెక్టులకు ఇకపై ఆస్ట్రేలియా యురేనియం
- భారత్, ఆస్ట్రేలియా మధ్య కుదిరిన పౌర అణుశక్తి ఒప్పందం
- ఇరుదేశాల ప్రధానమంత్రులు నరేంద్ర మోదీ, ఆంథోనీ అల్బానీస్ భేటీ
- కీలక రంగాల్లో పరస్పరం సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయం
- ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంపై కార్యాచరణ వేగవంతం
- ఓడల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణలో కలిసికట్టుగా అంగీకారం
- ఉగ్రవాదంపై ఆస్ట్రేలియాలో కలిసి పోరాటం సాగిస్తామన్న మోదీ
- 18 ఒప్పందాలపై సంతకాలు చేసిన రెండు దేశాలు
- గురుగ్రామ్, బెంగళూరులో ఇక ఆస్ట్రేలియా యూనివర్సిటీల క్యాంపస్‌లు

2లో

## తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి

- అప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుంది
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది
- రాష్ట్ర పార్టీ నేతలతో కేంద్రమంత్రి జేపీ నడ్డా

హైదరాబాద్: బీజేపీలోకి ఇతర పార్టీల వారిని చేర్చుకునేందుకు తలుపులు తెరవాలని రాష్ట్ర పార్టీ నేతలకు కేంద్ర ఆరోగ్య, రసాయనాలు--ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా సూచించారు. వేరే పార్టీలకు చెందిన వారిని కలుపుకుంటేనే బీజేపీ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. రాష్ట్ర పార్టీ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి

- మిగతా 2వ పేజీలో





## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి...

- ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా: ఎంఎస్ రాజు
- వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజం
- ఇది తన ఆత్మగౌరవానికి, ప్రకాశ్ రెడ్డి అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్య
- ప్రకాశ్ రెడ్డి సోదరుడిని కటకటాల వెనక్కి పంపే వరకు పోరాటం ఆగదని హెచ్చరిక
- తనపై చేసిన ఆరోపణలను గురువారం లోపు నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి సవాల్
- తోపుదుర్తి కుటుంబ చరిత్రపై, వారి ఆర్థిక లావాదేవీలపై సంచలన ఆరోపణలు

2లో

# తలుపులు తెరవండి.. వేరే పార్టీల వారిని చేర్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. 'మీరు కష్టపడి పనిచేయండి మీతోపాటు మేము ఉంటాం. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలను ప్రతి ఒక్కరూ అభిమానిస్తారు. మీ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని అభిమానించేంతలా చూసుకోవాలి. కార్యకర్తలతో మంచిగా ఉండండి. వారితో మంచిగా లేకుంటే మీరు డిస్‌కనెక్ట్ అవుతారు'అని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, ఇతర పార్టీల నుంచి పలువురు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తమకు సమాచా రం ఉందన్నారు. గురువారం రాష్ట్రానికి వచ్చిన నడ్డా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమైనప్పుడు ఈ కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. 'ఇప్పటికే ఒకసారి మన బస్సు (అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి) మిస్సయింది. ఇంకోసారి బస్సు మిస్ కానివ్వకండి. వేర్లు లేని చెట్ల లాగా మారకండి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వ్యతిరేకతే మనల్ని గెలిపిస్తుందనే భావనతో ఉండకండి. సొంతంగా పార్టీ గెలిచేందుకు మనం ఏం చేస్తున్నాము అనేది కూడా చాలా ముఖ్యం. నేను అవినీతికి పాల్పడను. ఇంకొకరిని అవినీతి చేయనివ్వను అన్న ప్రాథమిక సూత్రంతోనే మోదీ విజయం సాధించారు. మనమంతా కూడా మోదీ పేరు చెప్పుకొని గెలుస్తున్నా...సొంతంగా గెలుపు కోసం అనుసరించబోయే కార్యాచరణ ఉందా ? మీ అంత మీరు గెలిచేందుకు ఏం చేస్తున్నారు? ఆత్మవిమర్శ చేసుకోండి. అవినీతితో పోరాడడంతోపాటు ఎల్లప్పుడూ ప్రజల పక్కనే చేదోడువాదోడుగా నిలిస్తే తప్పకుండా వారు ఆదరిస్తారు. మీ మీ కార్యక్షేత్రాలను వదలకుండా కష్టపడి పనిచేయాలి. లీడర్ల వెంట తిరిగినంత మాత్రాన లీడర్లు కాలేరు. రేపు కాంగ్రెస్ నేతలను (హిమాచల్‌లో) కలవడానికి వెళుతున్నాను. ఎందుకంటే వారిని కలిస్తే వారు మనవారు అవుతారు'అని నడ్డా దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డా.కె.లక్ష్మణ్, బీజేఎల?పనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీనేతలు పొంగులేటి సుధాకరరెడ్డి, గరికపాటిమోహన్‌రావు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, శాంతికుమార్, చింతల రామచంద్రారెడ్డి బండారు విజయలక్ష్మి, లంకెల దీపక్‌రెడ్డి, కప్పర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రభుత్వం ఏటీఎంగా మారిందని, అదే ప్రభుత్వం కొనసాగాలా? మారాలా? అన్నది రాష్ట్ర ప్రజలు నిర్ణయం తీసుకోవాలని జేపీ నడ్డా పిలుపునిచ్చారు. గురువారం ఓ హోటల్‌లో ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం--దౌత్యం--అభివృద్ధి'అంశంపై నిర్వహించిన మేధావుల గోష్టిలో నడ్డా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌ను అంతర్గతంగా బలోపేతం చేస్తూనే, ప్రపంచవ్యాప్తంగా దేశ గౌరవాన్ని శిఖరాగ్రానికి చేర్చిన ఘనత ప్రధాని మోదీదని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్‌సీయూ వీసీ జె.అనురాధ, ఐఫ్లూ వీసీ ప్రొ.నాగళ్లపల్లి నాగరాజ్ ప్రసంగించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, వివిధరంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

## మౌలిక వసతులపై భీకర దాడులు

దుబాయ్: చర్చలతో తేలదని, బాంబులతోనే తేల్చుకుంటామని ప్రకటించిన కొద్దిసేపటికే ఇరాన్‌పై క్షిపణుల వర్షం కురిపించి పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధాగ్నిని ప్రజ్వరిల్లజేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలతో రెండోరోజూ ఇరాన్‌పై అగ్రరాజ్యసేనలు విరుచుకుపడ్డాయి. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, ఆయుధాగారాలు, ఎయిర్‌పోర్ట్ రన్‌వేలతోపాటు ఈసారి మౌలిక వసతులపై అమెరికా గురిపెట్టింది. దీంతో ఇరాన్‌లోని రైల్వేలైన్లు, వంతెనలు, నౌకాశ్రయాలు దాడుల బారిన పడ్డాయి. గత 48 గంటల్లో ఇరాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, క్షిపణి స్థావరాలు, సైనిక స్పీడ్ బోట్లు, మౌలికవసతులు ఇలా మొత్తంగా కీలకమైన 170 లక్ష్యాలపై దాడులు చేశామని అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్ గురువారం ప్రకటించింది. హార్మూజ్ జలసంధి గుండా సరకు రవాణా నౌకల స్వేచ్ఛా వాణిజ్యాన్ని అడ్డుకునే ఇరాన్ సామర్థ్యాన్ని మరింతగా దెబ్బతీసే లక్ష్యంతోనే దాడులు చేస్తున్నామని సెంట్రల్ కమాండ్ స్పష్టంచేసింది. తొలిసారిగా చాబహార్ నౌకాశ్రయం మీదా దాడి చేసింది. నౌకల రాకపోకలను నియంత్రించే షాహీద్ బెహెష్తి మారిటైమ్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ సైతం ధ్వంసమైంది. చాబహార్‌లోని ఇరాన్ నేవీకి చెందిన ఇమామ్ అలీ స్థావరంపైనా అమెరికా యుద్ధవిమానాలు బాంబులు జారవిడిచాయి. బందర్ అబ్బాస్ నౌకాశ్రయం సమీపంలో ఎనిమిది పేలుళ్లు జరిగాయి. అబూ మూసా ద్వీపంపైనా అమెరికా దాడిచేసింది. బుషెహర్‌లోని అణు విద్యుత్‌కేంద్రం సమీపంలో గురువారం మధ్యాహ్నం బాంబుల శకలాలు పడ్డాయని ఇరాన్ ప్రకటించింది. అయితే దాడిలో న్యూక్లియర్ ప్లాంట్‌కు ఏమైనా నష్టం జరిగిందా లేదా అనే వివరాలను ఇరాన్ వెల్లడించలేదు.

# బలపడిన అణు బంధం

మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా మధ్య 'అణు'బంధం మరింత బలపడింది. భారత అణు విద్యుత్ ప్రాజెక్టులకు యురేనియం సరఫరా చేసేందుకు ఆస్ట్రేలియా ముందుకొచ్చింది. ఈ మేరకు ఇరుదేశాల మధ్య అత్యంత కీలకమైన పౌర అణుశక్తి ఒప్పందం కుదిరింది. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ సహా సముద్ర భద్రత, అరుదైన ఖనిజాల రంగాలకు సంబంధించి పలు చరిత్రాత్మక ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్ గురువారం మెల్‌బోర్న్‌లో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. కీలక రంగాల్లో పరస్పరం సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతికతలు, సప్లై చైన్లు, రక్షణ, భద్రతా సహకారం, సముద్ర భద్రతా సహకార రోడ్‌మ్యాప్, ఇంధన భద్రత తదితర అంశాల్లో మొత్తం 18 ఒప్పందాలపై సంతకాలు జరగడం విశేషం. వీటిలో భారత తీర రక్షక దళం(ఐసీజీ), ఆస్ట్రేలియాకు చెందిన మారిటైమ్ బోర్డర్ కమాండ్(ఎంబీసీ) మధ్య జరిగిన ఒప్పందం కూడా ఉంది. ఇది సముద్ర చట్టాల అమలు, సముద్ర ప్రాంతాలపై అవగాహన, సముద్ర సరిహద్దుల రక్షణ వంటి అంశాలలో పరస్పర సహకారానికి దోహదపడుతుంది. ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి రక్షణ విధానాన్ని ఖరారు చేసే దిశగా కార్యాచరణను వేగవంతం చేయాలని భారత్, ఆస్ట్రేలియా నిర్ణయించాయి. ఓడల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణలో కలిసికట్టుగా పనిచేయడానికి ఇరుపక్షాలు అంగీకారం తెలిపాయి. భారత్, ఆస్ట్రేలియాలు చారిత్రాత్మక పౌర అణు సహకార ఒప్పందంపై సంతకాలు చేసిన 12 ఏళ్ల తర్వాత పౌర అణుశక్తి ఒప్పందం కుదిరింది. ఇంధన భద్రతా ఫ్రేమ్‌వర్క్ నిబంధనల ప్రకారం.. బొగ్గు, డీజిల్, ఇతర ద్రవ ఇంధనాలు, సహజ వాయువుల స్థిరమైన, సురక్షితమైన, విశ్వసనీయమైన సరఫరాను కొనసాగించడం ద్వారా ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశాయి. 2028--29 సంవత్సరానికి గాను ఆస్ట్రేలియన్ డిఫెన్స్ కాలేజీలో భారతీయ సైనిక శిక్షకుడిని నియమించాలని నిర్ణయించారు. మరోవైపు భారత్‌లోని గురుగ్రామ్‌లో విక్టోరియా విశ్వవిద్యాలయం తన క్యాంపస్‌ను నిర్వహించుకోవడానికి ఆస్ట్రేలియా పక్షానికి ఆమోద పత్రం అందజేశారు. బెంగళూరులో ఫ్లిండర్స్ యూనివర్సిటీ తన క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరింది. భేటీ అనంతరం మోదీ, అల్బానీస్ ప్రకటన విడుదల చేశారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి అల్బానీస్‌తో అద్భుతమైన చర్చలు జరిగాయని నరేంద్ర మోదీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చర్చల ఫలితాలను 'అసాధారణమైనవి'గా అభివర్ణించారు. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనం, వాతావరణ చర్యలు, అణు శక్తి, కీలక ఖనిజాలు, సాంకేతికత, విద్య వంటి రంగాలపై చర్చించామని తెలిపారు. ఈరోజు అణు శక్తి రంగంలో ఒక కీలక ఒప్పందంపై సంతకం జరిగాయని అన్నారు. ఇది ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం సుగమం చేయడంతోపాటు భారత స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు నూతన శక్తిని ఇస్తుందని ఉద్ఘాటించారు. ఉగ్రవాదం అనేది కేవలం ఏదో ఒక దేశానికే కాకుండా మొత్తం మానవాళికి తీవ్రమైన సవాలుగా పరిణమించిందని భారత్, ఆస్ట్రేలియాలు గుర్తించినట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందుకే ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం సాగిస్తామన్నారు. తమ సంకల్పం అచంచలమైనదని, సహకారం మరింత బలపడుతూనే ఉందని వెల్లడించారు. ఇండియాతో ఆస్ట్రేలియాకు ఉన్న సంబంధం నేడు ఉన్నంత కీలకమైనదిగా గతంలో ఎప్పుడూ లేదని ప్రధాని ఆంథోనీ అల్బానీస్ పేర్కొన్నారు. పౌర అణుశక్తికి సంబంధించిన ఒప్పందం శాంతియుత ప్రయోజనాల కోసం ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం ఎగుమతులను సులభతరం చేస్తుందని వివరించారు. శిలాజ రహిత ఇంధన విద్యుత్ సామర్థ్యం వాటాను పెంచడానికి భారత్‌కు యురేనియం సరఫరా చేయబోతున్నట్లు తెలిపారు.

## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి...

మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేసి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, ఇది తనకు, ప్రకాశ్ రెడ్డికి మధ్య జీవితకాలం జరిగే యుద్ధమని ప్రకటించారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని రాజకీయంగా వెంటాడతానని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు. ఈ మేరకు మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎంఎస్ రాజు మాట్లాడుతూ, "లేని ఆరోపణలు చేసి సమాజంలో నా గౌరవానికి భంగం కలిగించిన నిన్ను, నా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన నిన్ను వదిలిపెట్టను. నీ అక్రమ ఆస్తుల దగ్గర నేనుంటా. నీ రాజకీయ పోరాటాన్ని చూస్తా. ఇది నా ఆత్మగౌరవం మీద జరిగిన దాడి. దున్నపోతు తల నరికే దొమ్మ పొగరున్న కులంలో పుట్టాను ప్రకాశ్.. భయం అనేది నాకు తెలీదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. తోపుదుర్తి కుటుంబ చరిత్రపై కూడా రాజు సంచలన ఆరోపణలు చేశారు. "రూ.800 కోసం లారీ డ్రైవర్‌తో తన్నులు తిన్న చరిత్ర మీ సోదరుడిది. చెప్పుల షాపులో కస్టమర్లు వదిలివెళ్లిన పాత చెప్పులు దొంగలించిన చరిత్ర మీ కుటుంబానిది. అద్దె ఇళ్లలో ఉంటూ యజమానులకు అద్దె చెల్లించకుండా వేధించిన చరిత్ర మీది. సిగ్గు లేకుండా నా గురించి మాట్లాడతారా?" అని ప్రశ్నించారు. తన ఆరాధ్య దైవం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల గురించి నీచంగా మాట్లాడిన ప్రకాశ్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డిని కటకటాల వెనక్కి పంపేంత వరకు తన పోరాటం ఆగదని రాజు స్పష్టం చేశారు. "నువ్వు ఎర మాత్రమే, నీ వెనక ఉన్న నీ అన్నే అసలు టార్గెట్" అని హెచ్చరించారు. తాను సామాన్య కుటుంబం నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని రాజు గుర్తుచేశారు. "టీడీపీ కార్యకర్తగా, పసుపు సైనికుడిగా ఉండటమే నాకు ఐదో పదవి. ప్రాణం ఉన్నంతవరకు పసుపు జెండా మోస్తా. చంద్రబాబు గారు నన్ను టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమిస్తే, దాన్ని ఆదాయ వనరుగా మార్చుకోలేదు. నా గదికి నేనే అద్దె కడతాను, కనీసం లడ్డూ కూడా తీసుకోను. కానీ మీరు టీటీడీని వ్యాపారంగా మార్చుకున్నారు" అని ఆరోపించారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి రాజు సవాల్ విసిరారు. "నాకు విల్లా ఎక్కడుంది? నా పార్టీ ఆఫీసు స్థలం ఎక్కడ? బెంగళూరులో నాకు ఆస్తులు ఎక్కడున్నాయో చూపించు. నీకు గురువారం వరకు సమయం ఇస్తున్నా. ఆరోపణలు నిరూపించు లేదా పరిణామాలకు సిద్ధంగా ఉండు" అని డిమాండ్ చేశారు. ఇది కేవలం రాజకీయ పోరాటం కాదని, తన ఆత్మగౌరవ పోరాటమని, తాను ఒక్కడినే పోరాడతానని ఎంఎస్ రాజు తేల్చిచెప్పారు.

## భారత్–పాక్ యుద్ధాన్ని నేనే ఆపేశా

వాషింగ్టన్: గత ఏడాది భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే స్వయంగా జోక్యం చేసుకొని నిలిపివేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఆయన బుధవారం తుర్కియే నుంచి తిరిగివస్తూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మాట్లాడారు. భారత్--పాక్ యుద్ధంలో 11 ఫైటర్ జెట్లు నేలకూలాయని చెప్పారు. అయితే, అవి ఏ దేశానికి చెందినవన్న సంగతి బయటపెట్టలేదు. భారత్--పాక్ యుద్ధం సహా ప్రపంచవ్యాప్తంగా 8 యుద్ధాలను తాను ఆపేశానని అన్నారు. ఈ ఘనత సాధించినందుకు నోబెల్ శాంతి బహుమ తికి తాను అన్నివిధాల అర్హుడినని స్పష్టంచేశారు.

## మత విద్వేషాలు రెచ్చగొడితే కూటమి ప్రభుత్వం సహించదని హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

తోక ముడిచారు. బతికున్న తల్లికి ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతూ, ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తున్నారు. తల్లికి గౌరవం ఇవ్వని ఇలాంటి వ్యక్తులు మన సమాజానికి అవసరమా " అని ప్రజలను ప్రశ్నించారు. "కుట్రలు, కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతాల పేరుతో సమాజాన్ని విడదీసేందుకు 'గొడ్డలి పార్టీ' ప్రయత్నిస్తోంది. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లను పెంచి పోషిస్తూ, రౌడీయిజంతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించింది" అని ఆయన ఆరోపించారు. గత పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా అనేక ఘటనలు జరిగాయని చంద్రబాబు గుర్తుచేశారు. "అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహ ధ్వంసం వంటి ఘటనల్లో గత పాలకులు నిందితులపై కనీస చర్యలు తీసుకోలేదు. చివరికి తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని సైతం కల్తీ చేసి భక్తుల నమ్మకాన్ని వమ్ము చేశారు. మేం ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. రెండు రోజుల క్రితం ఆదోని శివాలయంలో దీపంతో సిగరెట్ వెలిగించిన దుర్మార్గుడిని వెంటనే అరెస్ట్ చేశాం. మత విద్వేషాలు రగిలించే చర్యలను కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించదు" అని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు చేస్తున్న దుష్ప్రచారంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "'రావణ్' అనే వ్యక్తి హిందూ పురాణాలను, శ్రీరాముడిని, సీతాదేవిని కించపరుస్తూ మాట్లాడుతున్నాడు. తీవ్రవాదాన్ని, పాకిస్థాన్‌ను సమర్థించే ఇలాంటి వారికి 'గొడ్డలి పార్టీ' ఆర్థిక సహాయం అందించడం ఎంతటి బరితెగింపు? 'హే రామ్' అంటూనే రావణుడిని ప్రోత్సహించే వారిని ఏమనాలో అర్థం కావడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పిన వింతలు, విచిత్రాలు ఇప్పుడు చూస్తున్నాం" అని అన్నారు. సభ అనంతరం ముఖ్యమంత్రి వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వెదురుతో చేసిన ఆభరణాలను ఆసక్తిగా పరిశీలించారు.

## బండి భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోక్సో (గూజూగూ) చట్టం కింద అరెస్టయి చంచల్‌గూడ జైలులో ఉన్న బండి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఎట్టకేలకు తుది తీర్పును వెలువరించింది. దర్యాప్తు ముగిసి ఛార్జ్‌షీట్ దాఖలు చేసే దశకు రావడం, నిందితుడు ఇప్పటికే 49 రోజులకు పైగా జైలు శిక్ష అనుభవించిన నేపథ్యంలో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు నిందితుడికి కొన్ని కీలక షరతులను విధించింది. లక్ష రూపాయల విలువైన వ్యక్తిగత బాండ్లతో పాటు ఇద్దరు పూచీకత్తులను (షూరిటీలను) సమర్పించాలని స్పష్టం చేసింది. దర్యాప్తుకు సహకరించాలని, సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయడానికి ప్రయత్నించకూడదని న్యాయస్థానం ఆదేశించింది.

# మమ్మల్ని కొన్నాళ్లు పని చేయనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామన్నారు. కాలుష్యం కారణంగా దేశ రాజధాని ఢిల్లీ లాంటి నగరాల్లో నివసించలేని పరిస్థితి తలెత్తిందని, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని సీఎం పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ నగరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అందుకే హైదరాబాద్ నగరంలో కాలుష్య రహిత అభివృద్ధి జరగాలని నిర్ణయించామని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 2,100 చ.కి.మీ విస్తీర్ణంలోని క్యూర్ ఏరియాను పూర్తిగా సర్వీస్ సెక్టార్‌గా నిర్ణయించామని తెలిపారు. ప్రస్తుతం వైట్‌కాలర్ ఉద్యోగాలకు కాలం చెల్లింది. స్కిల్స్ ఉన్న వారికి బ్లూకాలర్ జాబ్స్‌కు కొదవ లేదు. ఇప్పటివరకు అమెరికా వైపు చూశాం. ప్రస్తుతం జర్మన్, జపాన్, చైనా, సౌత్ కొరియాను ఆదర్శంగా తీసుకుంటున్నాం. ఆయా దేశాలతో పోటీపడదాం. రాష్ట్రంలో ఏటా 10 లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు తీసుకుని బయటికి వస్తున్నారు. సంబంధిత సాంకేతిక నైపుణ్యం లేకపోవడంతో పది శాతం మందికి కూడా ఉద్యోగ అవకాశాలు లభించడం లేదు. వీరి నైపుణ్యాలను పెంచి, అవకాశాలు కల్పించే బాధ్యతలను పరిశ్రమలు తీసుకోవాలి. రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10 శాతం భాగస్వామ్యం కలిగి ఉండటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. సీతారాంపురంలో సోలార్ మాడ్యూల్ ప్లాంట్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందంటూ.. గ్రామంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు, ఉపాధి కోసం వ్యాపార సముదాయాలను నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు త్యాగం చేయడం వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ విశ్వవ్యాప్తం కావాలి: మంత్రి శ్రీధర్‌బాబు 'కేవలం పెట్టుబడులు ఆకర్షించడమే కాదు. ఆవిష్కరణలు, తయారీ ఇక్కడే జరగాలి. మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఇక్కడి నుంచే ప్రపంచానికి ఉత్పత్తులను అందించాలి. ఇదే మా ప్రభుత్వ సంకల్పం'అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రీమియర్ ఎనర్జీస్ లాంటి ప్రపంచ స్థాయి సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు తెలంగాణను ఎంచుకోవడం ఇక్కడి పారిశ్రామిక ప్రగతికి, రాష్ట్ర ప్రభుత్వంపై ఇన్వెస్టర్లకు ఉన్న విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

### 3 వేల మందికి ఉపాధి అవకాశాలు

సోలార్ మాడ్యూళ్ల తయారీ కేంద్రం 75 ఎకరాల్లో ఏర్పాటైంది. యూనిట్ పూర్తి సామర్థ్యానికి చేరుకుంటే 3 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి. కంపెనీ 6 గిగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఫెసిలిటీతో పాటు ఏటా 18 వేల మెట్రిక్ టన్నుల తయారీ సామర్థ్యంతో రానున్న అల్యూమినియం ఫ్రేమ్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసింది. దేశవ్యాప్తంగా ప్రస్తుత కేంద్రాల విస్తరణ, నూతన ఫెసిలిటీల కోసం సంస్థ 2028 నాటికి సుమారు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తోంది.



## చేనేత సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- నేడు పోచంపల్లిలో పోలింగ్.. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- బరిలో 21 మంది అభ్యర్థులు: ఎన్నికల అధికారి యూసఫ్ అలీ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారి యూసఫ్ అలీ తెలిపారు. శుక్రవారం జరగనున్న ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన అధికారికంగా వెల్లడించారు. సంఘంలో మొత్తం 644 మంది ఓటర్లు (సభ్యులు) ఉన్నారని, నూతన పాలకవర్గంలోని ఏడుగురు ఓపెన్ కేటగిరీ స్థానాలకు, ఇద్దరు మహిళా స్థానాలకు కలిపి మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని పేర్కొన్నారు. ఇందులో జనరల్ స్థానాల కోసం 17 మంది, మహిళా స్థానాల కోసం నలుగురు పోటీ పడుతున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచే ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారి వివరించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా స్థానిక డై హౌస్ భవనంలో అన్ని వసతులు కల్పించామన్నారు.

## మరోసారి అవకాశం ఇస్తే చేనేత సంఘం మరింత ప్రగతి

- ముగిసిన సహకార ఎన్నికల ప్రచార పర్వం
- లక్ష్మీనగర్ కాలనీలో చైర్మన్ అభ్యర్థి భారత వాసుదేవ్ ఇంటింటి ప్రచారం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** చేనేత సహకార సంఘం ఎన్నికల్లో మరోసారి తమకు అవకాశం కల్పిస్తే సంఘాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తామని చైర్మన్ అభ్యర్థి భారత వాసుదేవ్ పేర్కొన్నారు. సంఘం ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా గురువారం పురపాలక కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో ప్యానెల్ సభ్యులతో కలిసి ఆయన విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరును కలుస్తూ తమ ప్యానెల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వాసుదేవ్ మాట్లాడుతూ.. గతంలో తాను చైర్మన్‌గా ఉన్న కాలంలో సంఘం అభ్యున్నతికి ఎంతో కృషి చేశానని గుర్తుచేశారు. నేత కార్మికులకు నిరంతరం పని కల్పించడంతో పాటు, చేనేత చీరల విక్రయాల కోసం నూతన షోరూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల సంఘం ఉత్పత్తి పెరగడమే కాకుండా మంచి ఆదాయాన్ని గడించిందని వివరించారు. మరోసారి గెలిపిస్తే సంఘాన్ని మరింత ప్రగతి పథంలో నడిపిస్తామని, ప్రతి కార్మికుడికి చేతినిండా పని కల్పించడంతో పాటు అర్హులైన నూతన సభ్యులకు సంఘంలో అవకాశం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో ప్యానెల్ సభ్యులు గంజి అంజయ్య, జోగు లక్ష్మీనారాయణ, భోగ బాల నరసింహ, పగడాల బుచ్చమ్మ, భారత భారతమ్మ, భారత గిరి వాసు, గంజి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రేవణపల్లి చేనేత సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

- నూతన అధ్యక్షుడిగా కొంగరి జంగయ్య ఏకగ్రీవం
- ఘనంగా సన్మానించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పురపాలక కేంద్రంలోని మూడో వార్డు పరిధి రేవణపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ రావుల జంగయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొంగరి జంగయ్యతో పాటు పాలకవర్గ సభ్యులతో చేనేత శాఖ అధికారి మురళీ మనోహర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా వనం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా కొంగరి వెంకటేష్, కోశాధికారిగా చెరుపల్లి గురుస్వామి, కార్యవర్గ సభ్యులుగా గుండు కృష్ణ, గంజి సుదర్శన్, రవ్వ లక్ష్మణ్, మహిళా ప్రతినిధులుగా సూరపల్లి లక్ష్మమ్మ, దుద్యాల జయమ్మలు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ముఖ్య అతిథులు నూతన కార్యవర్గానికి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి పాలకవర్గం కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండు మధు, కడవేరు ఎల్లప్ప, రుద్ర యాదగిరి, గుండు రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి భూమికి స్పష్టమైన హక్కు.. 'భూధార్' గుర్తింపు




- దశలవారీగా భూముల రీ సర్వే - తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల్లో గుర్తింపు
- ప్రతి భూమికీ 'భూధార్' యూనిక్ నంబర్ కేటాయింపు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్



**తొలివెలుగు, హైదరాబాద్/ యాదాద్రిభువనగిరి:** రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా భూముల రీ సర్వే నిర్వహించి, ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి ఆయన గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున రీ సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సర్వే ద్వారా ప్రతి సర్వే నంబరుకు స్పష్టమైన హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయిస్తామన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ సాంకేతికతతో ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. రీ సర్వే చేపట్టే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వామ్యం చేయాలన్నారు. సోమవారం నుంచి సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా శిక్షణ ప్రారంభించాలన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖా పరమైన సర్వేయర్లు, డీటీలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యంపై ఉన్నత న్యాయస్థానం చేసిన తీవ్ర వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సాధారణ విధుల నిర్వహణకు కూడా కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని, పెండింగ్ దరఖాస్తులపై వివరణకు నాలుగు వారాల గడువు ఇచ్చిందని గుర్తుచేశారు. ఏ ఒక్క దరఖాస్తు కూడా 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి

- కాంగ్రెస్ ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి భారత లవ్‌కుమార్
- మార్కండేయ నగర్, భవనరుషిపేటలో ముమ్మర ప్రచారం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** చేనేత సహకార సంఘం అభ్యున్నతి కోసం నిరంతరం ఒక సైనికుడిలా పనిచేస్తానని కాంగ్రెస్ ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి భారత లవ్‌కుమార్ పేర్కొన్నారు. సంఘం ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా గురువారం పురపాలక కేంద్రంలోని మార్కండేయ నగర్, భవనరుషిపేట కాలనీలలో ప్యానెల్ సభ్యులతో కలిసి ఆయన విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరును కలుస్తూ తమ ప్యానెల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా లవ్‌కుమార్ మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమపై తనకు పూర్తిస్థాయి అవగాహన ఉందన్నారు. కార్మికులకు నిరంతరం పని కల్పించడంతో పాటు సంఘం ఆర్థిక వృద్ధికి శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం చేనేత రంగానికి పెద్ద సమస్యగా మారిన డూప్లికేట్ ప్రింటెడ్ చీరలపై తాను ఇప్పటికే పోరాడుతున్నానని గుర్తుచేశారు. చైర్మన్‌గా తనను గెలిపిస్తే కార్మికుల మద్దతుతో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, డూప్లికేట్ చీరల విక్రయాలను నివారించేందుకు గట్టిగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ సభ్యులు సూరపల్లి శ్రీనివాస్, కోడి బిక్షపతి, సీత కృష్ణ, సీత శ్రీశైలం, కర్నాటి ధనంజయ, పాలాది జ్యోతి యాదగిరి, మహేశ్వరం నాగమణి, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, నాయకులు కురపాటి బాబు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నిజం చేస్తున్న 'ఇందిరమ్మ ఇల్లు'

- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచ్ ఏర్పుల వెంకటేశం
- హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు వాకిటి అనంతరెడ్డి





**తొలివెలుగు, వలిగొండ:** మండల పరిధిలోని వేములకొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులిపలుపుల రాములు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వేములకొండ గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు వాకిటి అనంతరెడ్డి, జిల్లా, మండల నాయకులతో కలిసి నూతన గృహాన్ని సందర్శించి రాములు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించాలనే మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం సామాన్యులకు ఎంతో మేలు చేకూరుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, పాశం సత్తిరెడ్డి, శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సామ రాంరెడ్డి, వలిగొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్కే. రసూల్, సీనియర్ నాయకుడు కాసుల వెంకన్న గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేరుకే 'ఆదర్శం'.. వసతుల్లో శూన్యం

- రేకుల షెడ్డులో వంట.. ఎండలోనే విద్యార్థుల భోజనాలు
- మోడల్ స్కూల్ దారి అంతా గుంతలమయం: సీపీఎం ఆందోళన





**తొలివెలుగు,చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు అన్నం తినడానికి కూడా సరైన స్థలం లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ. పాషా మండిపడ్డారు. గురువారం పాఠశాలను సందర్శించిన సీపీఎం బృందం విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకుంది. అనంతరం పాషా, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య అందిస్తున్నామని సంబరపడుతున్న అధికారులు, వసతుల కల్పనను గాలికొదిలేశారని విమర్శించారు. కనీసం కూర్చొని ప్రశాంతంగా అన్నం తినడానికి డైనింగ్ హాల్ లేక విద్యార్థులు ఎండను, వర్షాన్ని లెక్కచేయకుండా ఇబ్బందికర పరిస్థితుల్లో భోజనం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తే రేకుల షెడ్డులో వంట చేయడం అగచాట్లుగా మారుతోందన్నారు. తక్షణమే డైనింగ్ హాల్ నిర్మించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు వెళ్లే దారి అధ్వాన్నంగా మారి విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రమాదాల బారిన పడుతున్నారని, తక్షణమే సీసీ రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారు నరసింహ, దండా అరుణ్ కుమార్, ఆకుల ధర్మయ్య, తొర్పునూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎండీ. ఖయ్యూం, తొర్పునూరి వెంకటేష్, తొర్పునూరి సుమలత పాల్గొన్నారు.

# రేణికుంట పీఏసీఎస్ చైర్మన్‌గా నమిల మహేందర్ గౌడ్

- 13 మందితో కూడిన నామినేటెడ్ కార్యవర్గం ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ఏపీసీ సెక్రటరీ సురేందర్ మోహన్



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన నామినేటెడ్ కార్యవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు 13 మంది సభ్యులతో కూడిన నూతన కమిటీని ఖరారు చేస్తూ ప్రభుత్వ ఏపీసీ సెక్రటరీ చైర్మన్ సురేందర్ మోహన్ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం నూతన చైర్మన్‌గా రాజాపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నమిల మహేందర్ గౌడ్‌ను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా గుజ్జల బాలరాజు, జంగా లక్ష్మి, భూక్య మన్య, కోరే మల్లయ్య, రాపోలు నారాయణరెడ్డి, మసిరెడ్డి సురేందర్ రెడ్డి, కోటగిరి సంతోష, జూకంటి వీరయ్య, గుడిసెల నరసింహులు, చెట్కూరి గౌరయ్య, చెక్కల బాలయ్య, చిగుళ్ల చంద్రపాల్‌లను నియమించారు. మొత్తం 13 మందితో కూడిన ఈ పాలకవర్గంలో 12 మంది అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాగా, ఒకరు సీపీఐ పార్టీకి చెందిన వారిగా నియామక ఉత్తర్వుల ద్వారా స్పష్టమవుతోంది. నూతన కార్యవర్గం త్వరలోనే బాధ్యతలు స్వీకరించనుంది.

# శ్రీనివాస పవర్ లూమ్ సొసైటీ అధ్యక్షుడిగా ఆడెపు రామకృష్ణయ్య ఏకగ్రీవం

- డైరెక్టర్ల నియామకాన్ని ప్రకటించిన ఎన్నికల అధికారి అజీమోద్దీన్
- నూతన కార్యవర్గానికి పద్మశాలి సంఘం ఘన సత్కారం



**తొలివెలుగు, రాజాపేట:** స్థానిక శ్రీనివాస పవర్ లూమ్ సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా ఆడెపు రామకృష్ణయ్య (రామకిష్టయ్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి అజీమోద్దీన్ గురువారం ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. సంఘంలోని 9 డైరెక్టర్ పోస్టులకు గాను మొత్తం 12 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన 9 మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం జరిగిన అంతర్గత ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా ఆడెపు రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా ఆడెపు శ్రీశైలం, కార్యదర్శిగా సకినాల శ్రీనివాసులు, కోశాధికారిగా పొట్టబత్తిని నరహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గొట్టిపాముల సాయికృష్ణ, సకినాల ఉపేందర్, పొట్టబత్తిని నరేందర్, ఆడెపు రమాదేవి, కర్నాటి లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజాపేట శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు శ్రీశైలం నూతన కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, పవర్ లూమ్ కార్మికుల సంక్షేమానికి పదవిలో ఉండి పూర్తి న్యాయం చేస్తానని రామకృష్ణయ్య పేర్కొన్నారు.

# అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- నేడు 'ఆల్ ఇండియా డిమాండ్స్ డే'ని జయప్రదం చేయాలి
- రాజాపేట మండల అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్

**తొలివెలుగు, రాజాపేట:** అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాజాపేట మండల అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. జూలై 10న నిర్వహించ తలపెట్టిన అంగన్‌వాడీల 'ఆల్ ఇండియా డిమాండ్స్ డే'ను అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 45వ ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం టీచర్‌కు రూ.41,000, హెల్పర్లకు రూ.35,000 కనీస వేతనం నిర్ణయించాలని కోరారు. రిటైర్మెంట్ తర్వాత నెలకు రూ.18,000 పెన్షన్ చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం గ్రాట్యూటీ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, అంగన్‌వాడీలపై అదనపు భారంగా మారిన ఎఫ్ఆర్ఎస్, బీఎల్ఓ, ఎస్ఐఆర్ విధులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ-2020) చట్టాన్ని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. ఐసీడీఎస్ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధుల వాటాను పెంచి, అంగన్‌వాడీ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ ఒకేసారి భర్తీ చేయాలని స్పష్టం చేశారు.

# అత్తాపూర్‌లో హత్యాయత్నం కేసు ఛేదన.. 48 గంటల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

అత్తాపూర్ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందం సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక చర్యల్లో హత్యాయత్నం కేసును 48 గంటల్లో ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు కత్తులు, రెండు మొబైల్ ఫోన్లు, బాధితుడు మరియు ప్రధాన నిందితుడికి సంబంధించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, జూలై 7 అర్ధరాత్రి సమయంలో చింతల్‌మెట్‌లోని సులేమాన్‌నగర్‌లో రూ.2,100 కూలీ బకాయి చెల్లింపు విషయంలో తలెత్తిన వివాదం తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో సయ్యద్ ఆఫ్తాబ్ అలియాస్ అఫ్ఫూ, అక్బర్ ఖాన్ కలిసి సయ్యద్ పాషపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడి పొత్తికడుపు కుడి భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. దర్యాప్తులో భాగంగా నిందితులను గుర్తించిన పోలీసులు 48 గంటల్లో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ప్రధాన నిందితుడు సయ్యద్ ఆఫ్తాబ్‌పై గతంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్లలో నమోదైన హత్యాయత్నం కేసులు పెండింగ్‌లో ఉండగా, అక్బర్ ఖాన్‌పై మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసు విచారణలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# చిట్యాల-భువనగిరి రోడ్డు విస్తరణకు మోక్షం

- దశాబ్దాల నిరీక్షణకు తెరదించిన ప్రజా ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ వేముల వీరేశం చొరవతో నిధుల మంజూరు
- త్వరలోనే మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన
- అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం
- పల్లె జనం మధ్యకు ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారానికి హామీ





**తొలివెలుగు, రామన్నపేట:** ఎన్నో సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లా ప్రజలు నిరీక్షిస్తున్న చిట్యాల-భువనగిరి ప్రధాన రహదారి విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారి, ఇరుకైన సింగిల్ రోడ్డుగా ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు నిరంతరం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వ విప్, నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యుడు వేముల వీరేశం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఈ రహదారి విస్తరణ పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులను (అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్) మంజూరు చేయించారు. త్వరలోనే రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ఈ విస్తరణ పనులకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రభుత్వ విప్ వేముల వీరేశం రాష్ట్ర రోడ్లు, భవనాల (ఆర్అండ్‌బీ) ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన స్థలాన్ని నిశితంగా పరిశీలించి, అధికారులకు నాణ్యతా ప్రమాణాలపై పలు సూచనలు చేశారు.

**టీ స్టాల్ వద్ద ప్రజలతో ఆత్మీయ సంభాషణ:**

అనంతరం రామన్నపేట మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఒక టీ స్టాల్ వద్ద ప్రభుత్వ విప్ వేముల వీరేశం కాసేపు ఆగి స్థానికులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఎమ్మెల్యేను తమ మధ్య చూసిన స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తామని, నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే తన ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జినుకల ప్రభాకర్, మేజర్ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపసర్పంచ్ రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, మహమ్మద్ రెహాన్, జెల్ల వెంకటేశం, వార్డు సభ్యులు గోరిగే మహేష్, కొమ్ము శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందించాలి




- జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు అవగాహన సదస్సు
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి :** గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై జిల్లా స్థాయి అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లాలోని ఆలేరు, రాజాపేట, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూరు (ఎం), మోటకొండూరు, గుండాల, అడ్డగూడూరు, మోత్కూరుతో కూడిన 10 మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల పురోగతికి స్థానిక వనరుల వినియోగం అత్యంత కీలకమన్నారు. ముఖ్యంగా పంచాయతీల సొంత ఆదాయ వనరుల (ఓఎస్ఆర్) పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. జీపీఎస్‌ఏపీ ప్రణాళికల రూపకల్పన, వీబీ-జీ రామ్ జీ చట్టం-2025, నీటి సంరక్షణ కోసం ఉద్దేశించిన 'జల్ సిరి' కార్యక్రమం, ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026పై అధికారులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సరిత, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# రాజాపేటలో కాంగ్రెస్ 'సర్' హెల్ప్ డెస్క్ ప్రారంభం




- ఓట్ల నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఏఎంసీ డైరెక్టర్ సిల్వవేరు బాలరాజ్ గౌడ్

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్-2026) అవగాహన నిమిత్తం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను 'సర్' కోఆర్డినేటర్, ఏఎంసీ డైరెక్టర్ సిల్వవేరు బాలరాజ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి, అర్హులైన వారందరి ఓట్లను నమోదు చేయించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ తరఫున బూత్ లెవెల్ ఏజెంట్లను (బీఎల్ఏ) చైతన్యపరుస్తూ ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ నూతన చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్, రాజాపేట ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, గౌర బక్కయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బింగి రమేష్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ జన్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో 'నకిలీ' బిల్డర్ల దందా!





- రియాల్టర్లే బిల్డర్లుగా మారి అడ్డగోలు దందా
- ఆరు నెలలు తిరగకముందే గోడల పగుళ్లు.. లబోదిబోమంటున్న కొనుగోలుదారులు
- జీ+1 పరిమిట్‌తో మూడు, నాలుగు అంతస్తుల నిర్మాణాలు.. ప్రశ్నిస్తే బెదిరింపులు!

**తొలివెలుగు, చౌటుప్పల్ :** సొంతింటి కలను నిజం చేసుకోవాలనే సామాన్యుల ఆశలను ఆసరాగా చేసుకుని చౌటుప్పల్ పరిధిలో నకిలీ బిల్డర్లు రెచ్చిపోతున్నారు. రంగురంగుల డిజైన్లు, ఆకర్షణీయమైన ఎలివేషన్లతో బయటకు బ్రహ్మాండంగా కనిపిస్తున్న ఇండ్లు.. లోపల మాత్రం నాసిరకం మెటీరియల్‌తో కుప్పకూలేందుకు సిద్ధంగా ఉంటున్నాయి. కనీసం కన్‌స్ట్రక్షన్ పైన కనీస అవగాహన లేని కొందరు రియాల్టర్లు, బ్రోకర్లు ఒకటి నుంచి ఐదుగురు సభ్యులతో గ్రూపులుగా ఏర్పడి 'నకిలీ బిల్డర్లు'గా అవతారమెత్తారు. నిర్మాణ రంగంలో ఎలాంటి అనుభవం లేకపోయినా, కేవలం లాభార్జనే ధ్యేయంగా ఈ దందాలకు తెరలేపినట్టు స్థానికంగా బహిరంగ చర్చ సాగుతోంది.

**నాసిరకం మెటీరియల్.. ఆరు నెలలకే పగుళ్లు:**

బిల్డింగ్ నిర్మాణంలో వాడే ఇనుము, సిమెంట్ నుంచి మొదలుకొని లోపల అమర్చే కరెంట్ బాక్సులు, నల్లాలు, పైపుల వరకు అన్నింటిలోనూ అత్యంత నాసిరకమైన





మెటీరియల్ వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇల్లు కొని కనీసం ఆరు నెలలు కూడా తిరగకముందే గోడలు నిలువునా పగుళ్లు ఇస్తుండటం, స్లాబుల నుంచి నీరు లీక్ కావడం, బేస్‌మెంట్లు కుంగిపోవడం వంటి సమస్యలతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. చేసేదేమీ లేక, కొన్న ఇండ్ల రిపేరింగ్ కోసం మళ్లీ లక్షలాది రూపాయల అదనపు ఖర్చులు భరిస్తూ తలలు పట్టుకుంటున్నారు. ఇదేమిటని బిల్డర్లను ప్రశ్నిస్తే.. బెదిరింపులకు పాల్పడుతున్న వైనం చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**అనుమతులు ఒకటికి.. కట్టేది మూడు, నాలుగు!**

నిబంధనల ఉల్లంఘనల్లో ఈ నకిలీ బిల్డర్లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీల నుంచి కేవలం జీ ప్లస్ వన్ అనుమతులు తీసుకుని, క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా రెండు నుంచి మూడు నుంచి నాలుగు అంతస్తుల బిల్డింగులను లేపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల పర్వం నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కష్టపడి దాచుకున్న జీవితకాల సంపాదనతో పాటు, బ్యాంకు లోన్లు తెచ్చుకుని ఇండ్లు కొంటున్న మధ్యతరగతి ప్రజల పరిస్థితి ఈ నకిలీ బిల్డర్ల వల్ల అగమ్యగోచరంగా మారుతోందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బాధితులకు ఆయుధం 'రెరా' చట్టం!**

నకిలీ బిల్డర్ల చేతిలో మోసపోయిన కొనుగోలుదారులను ఆదుకోవడానికి భారతదేశంలో బలమైన రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చట్టం అందుబాటులో ఉందని న్యాయనిపుణులు స్పష్టం చేస్తున్నారు.




## సమస్యలు వస్తే ఏం చేయాలి?

గోడల పగుళ్లు, తేమ (సీపేజ్), బేస్‌మెంట్ కుంగడం వంటి సమస్యలు తలెత్తితే బాధితులు కంగారు పడకుండా ఈ క్రింది చర్యలు చేపట్టాలి:

1. ముందుగా బిల్డర్‌కు సమస్యల గురించి లిఖితపూర్వకంగా (రిటన్ నోటీస్) సమాచారం అందించాలి.
2. ఇంటి లోపాలు స్పష్టంగా కనిపించేలా ఫోటోలు, వీడియోలు తీసి భద్రపరచుకోవాలి.
3. కొనుగోలు ఒప్పందం (సేల్ అగ్రిమెంట్), బిల్డర్‌కు చేసిన చెల్లింపుల రసీదులను పక్కాగా దగ్గర ఉంచుకోవాలి.
4. ఒకవేళ లిఖితపూర్వక నోటీసుకు బిల్డర్ స్పందించకపోతే లేదా బెదిరింపులకు పాల్పడితే, ఆయా పత్రాలు, ఫోటోల ఆధారంగా సంబంధిత 'రెరా' అధికారికి లేదా వినియోగదారుల కమిషన్‌కు (కన్స్యూమర్ ఫోరం) నేరుగా ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చు.

## చట్టం ప్రకారం కొనుగోలుదారులకు ఉన్న హక్కులు ఇవే:

- 5 ఏళ్ల గ్యారెంటీ: ఒక ఇల్లు లేదా ఫ్లాట్ అమ్మిన తర్వాత, దానిని కొనుగోలుదారుకు అప్పగించిన తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు నిర్మాణ సంబంధిత లోపాలు ఏవి బయటపడినా, దాని పూర్తి నిర్వహణ (మెయింటెనెన్స్) బాధ్యత అమ్మిన వ్యక్తి లేదా బిల్డర్‌దే.
- ఉచితంగా సరిచేయాలి: నిర్మాణ నాణ్యతలో లోపాలు ఉంటే, కొనుగోలుదారు ఫిర్యాదు చేసిన నిర్ణీత గడువులోగా బిల్డర్ తన సొంత ఖర్చులతో వాటిని సరిచేయాల్సి ఉంటుంది. ఒకవేళ సరిచేయకపోతే బాధితులకు భారీ పరిహారం చెల్లించాల్సి వస్తుంది.



# బోగారం ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం ప్రారంభం

- ఉపాధ్యాయురాలు, ఆయాకు నియామక పత్రాల అందజేత
- గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్

**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని బోగారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆంగ్ల మాధ్యమ (ఇంగ్లీష్ మీడియం) తరగతులు గురువారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆంగ్ల మాధ్యమ బోధన కోసం కొత్తగా నియమితులైన ఉపాధ్యాయురాలితో పాటు, విద్యార్థుల సౌకర్యార్థం నియమించిన ఆయాకు గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడంతో పాటు, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు గ్రామస్థుల సహకారంతో నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బైకాని ఉమా మహేష్ యాదవ్, వార్డు సభ్యురాలు నేరటి మానస సురేష్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడి బలోపేతానికి సర్పంచ్ ముందడుగు

- స్వంత ఖర్చుతో విద్యా వాలంటీర్ నియామకం
- ప్రైవేట్ నుంచి సర్కారు బడికి సర్పంచ్ కుమార్తె
- సర్పంచ్ మాధవి భూపాల్‌ను సన్మానించిన కాంప్లెక్స్ హెచ్‌ఎం దొడ్డి స్వామి






**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని బాచుప్పల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రగతికి స్థానిక సర్పంచ్ బాచుప్పల మాధవి భూపాల్ విశేష కృషి చేస్తున్నారు. పాఠశాలలో గతంలో కేవలం 3గా ఉన్న విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయులతో కలిసి 19కి పెంచడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఇందులో భాగంగానే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన రెండో తరగతి కుమార్తెను సైతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా స్వచ్ఛందంగా ఒక విద్యా వాలంటీర్‌ను కూడా నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం మునిపంపుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను సందర్శించారు. బాచుప్పల బడి అభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచ్ మాధవి భూపాల్‌ను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఓర్సు వెంకటయ్య, శిరీషల పనితీరును అభినందించారు. ఈ సందర్భంగా దొడ్డి స్వామి మాట్లాడుతూ.. ప్రతి పల్లెలో తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యను ఆదరించాలన్నారు. బడులలో కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు, తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన మెనూ అమలు పక్కాగా ఉండాలన్నారు. అనంతరం ఆయన కుంకుడుపాముల, సూరారం, తుర్కపల్లి పాఠశాలలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు.

# ప్రభుత్వ విప్ వేముల వీరేశంను కలిసిన గడ్డం యాదగిరి

**పార్టీ బలోపేతం, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ**

**తొలివెలుగు, రామన్నపేట:** తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యుడు వేముల వీరేశంను ఆయన క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరి గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలతో పాటు సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై వారు చర్చించారు. అనంతరం గడ్డం యాదగిరి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను క్షేత్రస్థాయిలోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని, ఇందుకు పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో కృషి చేయాలని ప్రభుత్వ విప్ సూచించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని కోరారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకుడు చిట్టిమల్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# మూసీ కోసం పీఎంసీ

హైదరాబాద్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ పునరుజ్జీవంపై కీలక ముందడుగు పడింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ)ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మూసీ అభివృద్ధి డిజైన్ల పరిశీలన నుంచి నిర్మాణ పనుల్లో నాణ్యత, భద్రత, నిర్దిష్ట సమయపాలన, క్రమబద్ధమైన తనిఖీల వరకూ ఈ పీఎంసీదే బాధ్యత. అలాగే మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులను ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూసీకి రూ.4,500 కోట్ల రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చిన ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈపీసీకి సంబంధించిన చర్యలు చేపట్టాలని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్)ను ఆదేశించింది.

**రూ.7,345 కోట్లకు పరిపాలనా అనుమతులు**

మూసీ సుందరీకరణ తొలిదశలో మొత్తం 21 కిలోమీటర్లను అత్యంత ప్రాధాన్యత అంశంగా ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తీసుకున్నారు. జోన్--1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.20 కి.మీ, జోన్--1బీ కింద ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.80 కి.మీ. అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఈ తొలిదశ మూసీ పునరుజ్జీవానికి భూ సేకరణ మినహా రూ.7,345.12 కోట్లకు ప్రభుత్వం తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో ఏడీబీ రుణం మినహా మిగతా రూ.2,845.12 కోట్లను హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ నుంచి రుణం రూపంలో సమీకరించనున్నారు. మూసీ, ఈసా నదుల మధ్య ఉన్న ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ వరకూ ఉన్న ప్రాంతాన్ని త్రివేణి సంగమంగా అభివృద్ధి చేయాలని ప్రభు త్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేప థ్యంలో ఆయా ప్రాంతానికి మెరుగైన రవాణా సౌకర్యాలు, నదీ తీరంతో కూడిన స్థిరమైన పట్ట ణాభివృద్ధి కోసం ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను రూ పొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఎంఆర్‌డీసీఎల్, హెచ్‌ఎండీఏ అధికారులను ఆదేశించారు. మూసీ ఫేజ్--1 పరిధి లోని కీలక ప్రాంతాలను గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఉస్మాన్‌సాగర్, నార్సింగి ఎస్టీపీ సైట్, గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ భూములను పరిశీలించారు. మూసీ నదీ తీర ప్రాంత అభివృద్ధి ప్రా జెక్టు దీర్ఘకాలిక మనుగడ, పర్యావరణ సమతుల్యత, హైదరాబాద్ నగర రూపురేఖలను మా ర్చేలా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దేందుకు ఆయన పలు వ్యూహాత్మక సూచనలు చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, జాయింట్ ఎండీ పి.గౌతమి, జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నుంచి ఫీజుల వసూలొద్దు

హైదరాబాద్: ఫీజు వసూలు, రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి జీవో నంబర్--9లోని నాలుగు మార్గదర్శకాలపై ఇచ్చిన స్టేను హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. 2026--27 విద్యాసంవత్సరానికి విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయవద్దని స్పష్టం చేసింది. ఆగస్టు 15 వరకు అడ్మిషన్ల (తొలి ఏడాది) విద్యార్థుల ఫీజులు చెల్లిస్తామని.. ఈ నెలాఖరులోగా ఇతర సంవత్సరాల విద్యార్థుల ఫీజులు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఈ మేరకు ఉపశమనం ఇచ్చింది. ప్రవేశాలు యథావిధిగా కొనసాగించాలని కాలేజీలకు చెప్పింది. ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం విద్యార్థుల వివరాలను వారం రోజుల్లో సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. అనంతరం ప్రభుత్వం నిధుల విడుదల చర్యలు చేపట్టి.. జూలై 31లోగా ఫీజు చెల్లించాలని పేర్కొంది. ఇక మొదటి ఏడాది విద్యార్థులకు ఆగస్టు 15 డెడ్‌లైన్ విధించింది. ఆలోగా తొలిదశ ఫీజు చెల్లించాలని తేల్చిచెప్పింది. ఆ తర్వాత కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవడానికి వెసులుబాటు ఇచ్చింది. గురువారం సుదీర్ఘ వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణ వచ్చే నెల 20కి వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 6న జారీ చేసిన జీవో 9ను సవాల్ చేస్తూ 100కుపైగా కాలేజీలు హైకోర్టును ఆశ్రయించాయి. ఇది గత ఏప్రిల్‌లో హైకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నాయి. విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. జీవో నంబర్ 9లోని నాలుగు పేరాలపై గత నెల స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రవేశాలు ప్రారంభమైన నేపథ్యంలో స్టే ఎత్తివేయాలని కోరుతూ ప్రభుత్వం వెకేట్ స్టే పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. కాలేజీల తరఫున న్యాయవాదులు వాదిస్తూ 'విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవాలని హైకోర్టు చెప్పిన తర్వాత.. ప్రభుత్వం ఆ ఉత్తర్వులకు విరుద్ధంగా జీవో 7 తెచ్చింది. జీవో 7పై స్టే ఇస్తే.. జీవో 8, 9 తీసుకొచ్చింది. వాటిపైనా స్టే ఇవ్వడంతో వెకేట్ పిటిషన్ వేసింది. ఇదంతా చేసిన ప్రభుత్వంపై మాకు నమ్మకం ఎలా ఉంటుంది? విద్యార్థుల భవిష్యత్ కోసం అని చెబుతున్న ప్రభుత్వం.. తొలి దశగా రూ. 1,500 కోట్లు కూడా విడుదల చేయలేదా? ఈ ఏడాది కాలేజీల్లో చేరుతున్న ఫస్ట్ ఇయర్ వారికి ఇస్తామంటే.. మిగతా వాళ్ల పరిస్థితి ఏంటి? ఆగస్టు 27 వరకు చివరి అడ్మిషన్లకు అవకాశం ఉంది. ఒకవేళ ఆగస్టు 15న ప్రభుత్వం చెల్లిస్తే ఆ తర్వాత విద్యార్థులు చేరొచ్చు. జీవోపై స్టే ఉపసంహరించవద్దు. ఒకవేళ స్టేను సడలిస్తే అడ్మిషన్లకు సంబంధించి చెల్లింపుపై ఆగస్టు 19 వరకే అవకాశం ఇవ్వండి. అప్పటిలోగా కాలేజీలకు చెల్లించని పక్షంలో ఆగస్టు 20 నుంచి కాలేజీలు విద్యార్థుల నుంచి వసూలు చేసుకునేలా ఆదేశించండి'అని కోరారు. అనంతరం ప్రభుత్వం తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ 'అన్ని సంవత్సరాల విద్యార్థుల కోసం రూ. 250 కోట్లు విడుదల చేస్తున్నాం.

